ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సూర్యాపేట
5
సోమవారం 26 ఫిబ్రవరి 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442
యాదాద్రి : 1800 425 7106
సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.157	228	259
సూర్యాపేట	రూ.160	230	260
నల్లగొండ	రూ.160	230	260

ఉష్ణోగ్రత గరిష్ఠం 34.5 । కనిష్ఠం 23.4

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

- ఈ నెల 28 నుంచి మార్చి 19వరకు పరీక్షలు
- పరీక్ష కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలు
- నిమిషం ఆలస్యమైతే పరీక్ష కేంద్రానికి నో ఎంట్రీ



భానుపురి, ఫిబ్రవరి 25: ఇంటర్ పరీక్షలకు విద్యాశాఖ అధికారులు సర్వం సిద్ధంచేశారు. విద్యార్థుల సంఖ్యను బట్టి సెంటర్లను కేటాయించినట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో 16,600 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఈ నెల 28వ తేదీ నుంచి మార్చి 19వరకు ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. పరీక్షా కేంద్రాల్లో అన్ని వసతులు ఏర్పాటు చేయాలని ఆయా సెంటర్ల యాజమాన్యాలకు సూచించారు. ఇప్పటికే విద్యార్థులు పరీక్ష రాసే సెంటర్లు, హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచినట్లు అధికారులు పేర్కొంటున్నారు. పరీక్షాకేంద్రాల వద్ద పటిష్ఠ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయడంతోపాటు పరీక్షాకేంద్రాల పరిధిలో 144సెక్షన్ కూడా అమలు చేయనున్నారు. పరీక్షల్లో ఈసారి కూడా నిమిషం నిబంధనను అమలుచేస్తున్నారు. పరీక్ష కేంద్రం వద్ద ఒక నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజు కడితేనే హాల్‌టికెట్ ఇస్తామని చెబుతుండడం సరి కాదని ఆయా విద్యార్థి సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా 16,600 మంది విద్యార్థులు

జిల్లాలోని 77 కళాశాలల్లో 16,600 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు7, సాంఘిక సంక్షేమ కళాశాలలు 8, బీసీ సంక్షేమ శాఖ కళాశాలలు 8, కేజీబీవీ కళాశాలలు 5, మైనార్టీ కళాశాలలు 4, గిరిజన సంక్షేమ కళాశాలలు 3,తెలంగాణ రెసిడెన్షియల్ కళాశాల 1, ఆదర్శ కళాశాలలు 9 ఉన్నాయి. వీటితోపాటు 32 ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరు కానున్నా రు. ఇంటర్ ప్రథమ సంవత్సరం 8,300 మంది, ద్వితీయ సంవత్సరం 8,300 మంది పరీక్షలు రాయనున్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఈ నెల 28నుంచి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు 29 నుంచి పరీక్షలు మొదలు కానున్నాయి.

పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు

జిల్లాలో ఇంటర్ విద్యార్థులు 32 కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నారు. వీరికి సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయా సెంటర్ల నిర్వాహకులకు అధికారులు సూచించారు. కేంద్రాల్లో సరిపడా వెలుతురుతోపాటు విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, డ్యూయల్ డెస్క్ బెంచీలు, సీసీకెమెరాలు, మూత్రశాలలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని అధికారులు పేర్కొన్నారు. ప్రతీ సెంటర్‌కు చీఫ్ సూపరింటెండెంట్ అధికారి, డీవో(డిపార్టుమెంట్ అధికారి)ని కేటాయించినట్లు వివరించారు. జిల్లావ్యాప్తంగా 850 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు చెప్పారు.

ఇంటర్మీడియట్ పరీక్షలకు సర్వ సిద్ధం

ఇంటర్మీడియట్ పరీక్షలకు సర్వసిద్ధం చేస్తున్నాం. ఇప్పటికే సెంటర్లను, సిబ్బంది కేటాయించాం. సెంటర్లలో అన్ని మౌలిక సదుపాయాలు ఉండేలా కళాశాలల యజమాన్యాలకు ఆదేశాలు జారీ చేశాం. - డీఐఈవో కృష్ణయ్య, సూర్యాపేట

ప్రధాన పార్టీల్లో టిక్కెట్ల ఫైట్



లోక్‌సభ ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ అన్ని పార్టీల్లో టెన్షన్ మొదలైంది. అభ్యర్థుల ఎంపిక ఓవైపు..ఆశావహుల పైరవీలు మరోవైపు అధిష్ఠానాలకు తలనొప్పి తెచ్చిపెడుతున్నాయి. ప్రధాన పార్టీలు గెలుపు గుర్రాల కోసం సర్వేలు చేయిస్తుండగా, మొదటి నుంచి పార్టీనే నమ్ముకొని ఉన్న నేతల్లో గుబులు మొదలైంది. ఎవరికి వారు తమదైన రీతిలో క్షేత్రస్థాయి కార్యక్రమాల్లో పాల్గొంటుండగా ఎలాగైనా తమ పార్టీ అభ్యర్థులే గెలిచేలా మూడు ప్రధాన పార్టీలు వ్యూహరచన చేస్తున్నాయి.
- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి-నల్లగొండ)

- గెలుపే లక్ష్యంగా అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ కసరత్తు
- బలమైన అభ్యర్థులతో ఢీ కొట్టాలనే వ్యూహంలో బీఆర్‌ఎస్
- సీనియర్లను రంగంలోకి దించే యోచనలో కమలం పార్టీ



ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రెండు లోక్‌సభ సీట్లపై ప్రధాన పార్టీలు దృష్టి సారించాయి. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ అదే ఊపులో ఎంపీ సీట్లను గెలవాలని కసరత్తు చేస్తుంటే, ప్రతిపక్ష బీఆర్‌ఎస్ సైతం గట్టి అభ్యర్థులతో ఢీకొట్టేందుకు సిద్ధమవుతోంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఈసారి కొత్త సమీకరణాలతో సత్తాచాటేందుకు రెడీ అవుతోంది. మూడు పార్టీలనుంచి పోటీ చేసే అవకాశాలు దక్కించుకునేందుకు కీలకనేతలు పావులు కదుపుతున్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అనంతరం 2009నుంచి ఇప్పటివరకు జరిగిన మూడుఎన్నికల్లో ఈరెండు సీట్లలో కాంగ్రెస్సే హవా చాటింది. నల్లగొండ స్థానంలో మూడు పర్యాయాలూ కాంగ్రెస్సే గెలుపొందితే, భువనగిరిలో 2014లో ఒక్కసారి తప్ప మిగిలిన రెండుసార్లూ కాంగ్రెస్ విజయం సాధించింది. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ సర్కార్ ఉన్నప్పటికీ 2019 ఎన్నికల్లో రెండు సీట్లలో కాంగ్రెస్ అభ్యర్థులే గెలుపొంది, రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించారు. గుత్తాసుఖేందర్‌రెడ్డి(ప్రస్తుతం శాసనమండలి చైర్మన్) నల్లగొండ లోక్‌సభ నుంచి 2009, 2014లలో విజయం సాధిస్తే, 2019లో ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి (ప్రస్తుతం మంత్రి) విజయం సాధించారు. భువనగిరి నియోజకవర్గంలో 2009లో కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విజయం సాధిస్తే, 2014లో బీఆర్‌ఎస్ అభ్యర్థి బూరనర్సయ్యగౌడ్ విజయం సాధించారు. 2019లో కోమటిరెడ్డి వెంకటరెడ్డి(ప్రస్తుతం మంత్రి) విజయం సాధించారు.

బీజేపీలో టిక్కెట్ ఆశిస్తోన్న సీనియర్లు

కేంద్రంలో మూడోసారి మోదీ సర్కార్ కొలువుదీరుతుందనే నినాదంతో పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన బీజేపీనుంచి నల్లగొండ, భువనగిరి స్థానాలకు సీనియర్ నేతలు టిక్కెట్ కోసం పోటీపడుతున్నారు. నల్లగొండ నుంచి పార్టీ కిసాన్‌మోర్చా జాతీయనేత గోలి మధుసూదన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, గత ఎన్నికల్లో బరిలో నిలిచిన గార్లపాటి జితేందర్‌కుమార్ టిక్కెట్‌కోసం పోటీపడుతున్నారు. వీరితోపాటు ఇటీవల ఫార్వార్డ్‌బ్లాక్ నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి ఆశించిన స్థాయిలో ఓట్లు సాధించిన పిల్లి రామరాజుయాదవ్‌ని పార్టీలో చేర్చుకొని టిక్కెట్ ఇస్తే బలమైన పోటీ ఇచ్చే అవకాశముందని పార్టీ ఉన్నతవర్గాలు భావిస్తున్నట్లు తెలిసింది. భువనగిరి లోక్‌సభ నియోజకవర్గం నుంచి మాజీ ఎంపీ డాక్టర్ బూరనర్సయ్యగౌడ్, పార్టీ జాతీయ జలవనరుల విభాగం కన్వీనర్ డాక్టర్ వెదిరె శ్రీరామ్, పార్టీ సీనియర్‌నేత డాక్టర్ గంగిడి మనోహర్‌రెడ్డి, పీవీ శ్యాం సుందర్‌రావు బలంగా టిక్కెట్ ఆశిస్తున్నారు. ఈ నేతలంతా ఒకవైపు టిక్కెట్ ప్రయత్నాలు చేస్తూ మరోవైపు పార్టీ నిర్వహిస్తోన్న ప్రజా సంకల్ప యాత్రల్లో విస్తృతంగా పాల్గొంటున్నారు.

బీఆర్‌ఎస్ టిక్కెట్ ఎవరికో ?




బీఆర్‌ఎస్ సైతం ఉమ్మడి జిల్లాలో రెండు సీట్లలో కాంగ్రెస్‌కు ధీటుగా బలమైన అభ్యర్థుల్ని బరిలో దింపేందుకు కసరత్తు చేస్తోంది. ఉమ్మడి జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలోనే బీఆర్‌ఎస్ ఇటీవల నల్లగొండలో కృష్ణాజలాల హక్కుల సాధన పేరుతో భారీ బహిరంగసభ నిర్వహించడం తెలిసిందే. రెండు స్థానాల్లో అత్యంత బలమైన అభ్యర్థుల్ని బరిలో దింపడం ద్వారా కాంగ్రెస్‌ను ఢీకొట్టాలని మాజీమంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి వ్యూహం రచిస్తున్నారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తనయుడు అమిత్‌రెడ్డి నల్లగొండ లోక్‌సభ స్థానం నుంచి టిక్కెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. గుత్తా సుఖేందర్‌రెడ్డి పునర్విభజనకు ముందున్న నల్లగొండ పార్లమెంట్ సీటుకు ఒక పర్యాయం, పునర్విభజన తర్వాత ఏర్పడిన నల్లగొండకు రెండు పర్యాయాలు ఎంపీగా పనిచేయడంతో మొత్తంగా ప్రస్తుతమున్న నల్లగొండ, భువనగిరి నియోజకవర్గాల్లోని ఉమ్మడి జిల్లా నియోజకవర్గాలన్నింటికీ ఆయన ప్రాతినిధ్యం వహించడంతో నల్లగొండ వీలుకాకపోతే భువనగిరిలో సైతం అమిత్ పేరును అధిష్ఠానం పరిశీలించే అవకాశముందని తెలుస్తోంది. నల్లగొండ లోక్‌సభ సీటుకు అమిత్‌రెడ్డితోపాటు, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సోదరుడు కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ తేరా చిన్నపరెడ్డి అభ్యర్థిత్వంపై కూడా ముఖ్యనేత లు చర్చిస్తున్నారు. నియోజకవర్గంలో గిరిజన ఓటర్లు అత్యధికంగా ఉన్నందున ఈ దఫా ప్రముఖ వైద్యుడు డాక్టర్ మాతృనాయక్‌ని బరిలో దింపాలని పార్టీవర్గాల్లో ఒక చర్చ జరుగుతోంది. పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న ఉద్యమనేత, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి కూడా ఈసారి తనకు అవకాశం కల్పించాలని అధిష్ఠానం వద్ద తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. భువనగిరి లోక్‌సభస్థానం నుంచి ఉద్యమనేత జిట్టాబాలకృష్ణారెడ్డి ఈసారి టిక్కెట్ తనకే వస్తుందనే విశ్వాసంతో పనిచేసుకుపోతుంటే, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్య గౌడ్ కూడా టిక్కెట్ రేసులో ఉన్నారు. కీలకనేతలే బరిలో ఉండడంతో ఇక్కడ పార్టీ తీసుకునే నిర్ణయంపైనే అందరిలో ఆసక్తి నెలకొంది.

కాంగ్రెస్‌లో అభ్యర్థిత్వాలకు పోటాపోటీ..

ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన విజయాల ఊపులో ఉన్న కాంగ్రెస్‌నుంచి ఈ దఫా ఈ రెండు సీట్లలో కాంగ్రెస్ అభ్యర్థులుగా బరిలో నిలిచేందుకు కీలక నేతలు ప్రయత్నిస్తున్నారు. నల్లగొండ లోక్‌సభ ఇన్‌చార్జిగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, భువనగిరి లోక్‌సభ ఇన్‌చార్జిగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యవహరిస్తుండడంతో అభ్యర్థుల ఎంపికలో ఈనేతలిద్దరి అభిప్రాయం కీలకంకానుంది. నల్లగొండ లోక్‌సభ స్థానంనుంచి తొమ్మిది మంది ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి పోటీకి సిద్ధమైతే ఆయనకు అధిష్ఠానం నుంచి గ్రీన్ సిగ్నల్ వస్తుందని, ఆయన పోటీకి సుముఖత చూపకపోతే ఆయన తనయుడు పీసీసీ ప్రధాన కార్యదర్శి కుందూరు రఘువీర్‌రెడ్డి, మరో పీసీసీ ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి నడుమ టిక్కెట్ ఫైట్ నడిచే అవకాశం కనిపిస్తోంది. మరోవైపు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సైతం అధిష్ఠానం అవకాశం కల్పిస్తే తన కుమార్తె శ్రీనిధిరెడ్డిని పోటీలో నిలిపేందుకు సిద్ధమయ్యారు. వీరితోపాటు సామాజిక సమీకరణాలు, పార్టీ విధేయత దృష్ట్యా తనకు పోటీఛాన్స్ దక్కుతుందని డీసీసీ అధ్యక్షుడు కె.శంకర్‌నాయక్ ఆశిస్తున్నారు. భువనగిరి పార్లమెంట్ సీటుకు పీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి సోదరుడి కుమారుడు డాక్టర్ సూర్యపవన్‌రెడ్డి, జడ్పీమాజీ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి టిక్కెట్‌కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇటీవల అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఈస్థానంలో బీసీ అభ్యర్థిని నిలిపే అంశంపై పరిశీలిస్తున్నామని ప్రకటించడంతో ఇక్కడ సమీకరణాలు మారిపోతున్నాయి. ఇంకోవైపు ఉమ్మడి జిల్లాలో రెండు సీట్లలో అభ్యర్థులెవరైతే గెలుపు సులభంగా ఉంటుందనే అంశంపై పార్టీ వ్యూహకర్త సునీల్ కనుగోలు బృందం ఇప్పటికే క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహిస్తుండడంతో ఈ నివేదికలు సైతం అభ్యర్థి ఎంపికలో కీలకమవుతాయని భావిస్తున్నారు.

అంతా నా ఇష్టం

సూర్యాపేట వ్యవసాయ కార్యాలయంలో ఆయన చెప్పిందే వేదం. ఆయనకు ఎదురుచెబితే ఉద్యోగులపై పనిభారం మోపడం నైజం. కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న ఆ ఉద్యోగి షాడో కింగ్ అవతరమెత్తాడు. ఆ కార్యాలయంలో పనిచేసే కిందిస్థాయి సిబ్బంది అందరూ ఆయన కనుసన్నల్లో పని చేయాల్సిందేనని అక్కడి ఉద్యోగులు వాపోతున్నారు. ఆ శాఖలో ఉన్నత స్థాయి అధికారులను తనకు అనుకూలంగా మలుచుకోవడం వెన్నతో పెట్టిన విద్య. తనకు కేటాయించిన విభాగంలో కాకుండా, అతనికి అవసరం లేని విభాగంలోకి తలదూర్చి ఆ విభాగంలో పనిచేసే ఉద్యోగులకు తానే బాస్ అయినట్లు వ్యవహరిస్తారని వ్యవసాయ కార్యాలయంలో పనిచేసే కిందిస్థాయి ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నారు.
- సూర్యాపేట సిటీ



- వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆయనే బాస్
- కింది స్థాయి సిబ్బందిపై పెత్తనం
- మామూళ్లు ఇచ్చే ఏవోలకే సెలవులు
- ఫర్టిలైజర్ షాపుల నుంచి భారీగా వసూళ్లు
- వ్యవసాయ శాఖ కార్యాలయంలో చక్రం తిప్పుతున్న అధికారి

జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో పనిచేస్తున్న సదరు అధికారికి గతంలోనే పదోన్నతి వచ్చింది. ఆ పదోన్నతి తీసుకుంటే జిల్లానుంచి ఇతర జిల్లాకు వెళ్లాల్సి వస్తుందని భావించి, ఆ పదోన్నతిని తీసుకోకుండా సూర్యాపేట జిల్లా ఏర్పడి నాటి నుంచి నేటి వరకు వ్యవసాయ కార్యాలయంలోనే తిష్ఠ వేశారని ఉద్యోగులు చెబుతున్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని మచ్చిక చేసుకొని, ఇక్కడే విధులు నిర్వహిస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. వ్యవసాయ శాఖ కార్యాలయంలో కిందిస్థాయి ఉద్యోగులకు తానేబాస్‌గా వ్యవహరిస్తుండటం, ఆయన కనుసన్నల్లోనే గతంలో జిల్లా వ్యవసాయాధికారి పనిచేయడంతో ఆ కార్యాలయంలో అడ్డూ, అదుపు లేకుండా పోయిందని ఆవేదన చెందుతున్నారు.

నచ్చిన వారికే సెలవులు!

జిల్లాలో ఆయా మండలాల్లో పనిచేస్తున్న మండల వ్యవసాయాధికారులు ఆయన్ను ప్రసన్నం చేసుకుంటేనే సెలవులు మంజూరు చేస్తారని, లేకపోతే ఎలాంటి పరిస్థితిలో కూడా ఏవోలకు సెలవులు మంజూరు చేయరని కొంతమంది ఏవోలు బహిరంగంగా వెల్లడిస్తున్నారు. మామూళ్లు ఇచ్చే ఏవోలకు అవసరం లేకపోయినా సెలవులను మంజూరీ చేస్తారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాజకీయ పలుకుబడి కలిగిన ఏవోలకు నిబంధనలకు మించి ప్రసూతి సెలవులను మంజూరీ చేస్తాడని పలువురు ఆరోపిస్తున్నారు. కాన్పు దగ్గర పడుతున్న సమయంలో మాత్రమే ప్రసూతి సెలవులను మంజూరు చేయాలి కానీ, ఆ అధికారి మాత్రం ఇటీవ ల ఓ మండలానికి చెందిన ఏవో గర్భందాల్చిన మొదటి నెలనుంచే సెలవులు మంజూరు చేశారని, కారణం ఆ ఏవో భర్త ఒక శాఖలో ఉన్నత ఉద్యోగి కావడమేనని అక్కడి ఉద్యోగులు చెబుతున్నారు. కొంత మంది ఏవోలు ప్రసూతి సెలువులు ఇవ్వాలని దరఖాస్తు చేసినా, ఆ దరఖాస్తులను ఏమాత్రం పట్టించుకోకుండా ఏదో కారణం చెప్పి సెలవులు మంజూరు చేసేవాడు కాదని ఓ మండలానికి చెందిన ఏవో ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులిచ్చే ఇచ్చే ఏవోలను, ఏఈవోలను గౌరవంగా, మార్యదగా వ్యవహరించడం, ఆర్థికస్థితి సరిగాలేని ఏవోలను ఏమాత్రం లెక్క లేకుండా చూడటం అతనికి వెన్నతో పెట్టినవిద్య అని ఏవోలు వాపోతున్నారు. జిల్లా వ్యవసాయ కార్యాలయంలో పనులన్నీ ఆయన కన్నుసన్నల్లోనే జరుగుతుంటాయని ఆరోపిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

కార్యాలయంలో కిందిస్థాయి ఉద్యోగులపట్ల బాసిజం చూపుతున్న వ్యక్తి ఎవరనేది పరిశీలన చేస్తా. నేను విధుల్లో చేరి కొద్ది రోజులే అవుతోంది. కార్యాలయంలో జరుగుతున్న పరిణామాలపై కిందిస్థాయి ఉద్యోగులను కలుపుకొని శాఖ అభివృద్ధికి తోడ్పడతా.
- శ్రీధర్‌రెడ్డి, డీఏవో, సూర్యాపేట

ఫర్టిలైజర్ షాపుల నుంచి భారీగా వసూళ్లు

జిల్లాలోని ఫర్టిలైజర్ షాపులకు కొత్త లైసెన్స్‌లు పొందాలన్నా, లేక ఉన్న లైసెన్స్‌లు రెన్యూవల్ చేయాలన్నా యజమానులు అతడిని ప్రసన్నం చేసుకోవాల్సిందేనన్న ఆరోపణలున్నాయి. ముందుగా మామూళ్లు అందిన తర్వాతే ఫైల్ ముందుకు కదులుతుందని పేర్కొంటున్నారు. మామూళ్లు అందకపోతే ఫైల్ అక్కడే ఆగిపోవాల్సిందే. సూర్యాపేట జిల్లాకేంద్రంలో ఉన్న ఏడీఏ కార్యాలయంలో పనిచేస్తున్న కొంతమంది సిబ్బందికి ఆ మామూళ్లు అందించాలని, ఫర్టిలైజర్ షాపుల యజమానులకు ఆ అధికారి హుకుం జారీచేస్తారన్న ఆరోపణలున్నాయి. ఏడీఏ కా ర్యాలయంలో మామూళ్లు చెల్లించిన తర్వాతే ఆ ఫర్టిలైజర్ షాపులకు సంబంధించిన లైసెన్స్‌లు జారీ అవుతాయని, జిల్లా కేంద్రంలో ఉన్న ఫర్టిలైజర్ షాపుల నుంచి ఆయన భారీగా వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో ఫర్టిలైజర్ షాపు నుంచి రూ.10వేల నుంచి రూ.20వేల వరకు వసూలు చేసినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ విధంగా వసూలు చేసిన మామూళ్లను అతనికి అండగా ఉన్న వారికి పంపిస్తుంటారని, జిల్లా వ్యవసాయ కార్యాలయంలో కొంతకాలంగా ఆ అధికారి చక్రం తిప్పుతున్నా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఆ అధికారి ఆగడాలకు చెక్ పెట్టాలని ఉద్యోగులు, ఏవోలు ఉన్నతాఅధికారులను కోరుతున్నారు.

రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

డీఎంహెచ్‌వో కోటాచలం



సువెన్ ట్రస్టు ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో

సూర్యాపేటటౌన్, ఫిబ్రవరి 25: ప్రజలు రోగాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో కోటాచలం అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పోలీస్ భరోసా సెంటర్‌లో సువెన్ ట్రస్టు ఆధ్వర్యంలో జనతా ఆస్పత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రజలు చుట్టుపక్కల పరిసరాల్లో దోమలు నిల్వఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చెత్తాచెదారం పరిసరాల్లో లేకుండా నిత్యం జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సువెన్ ట్రస్టు గ్రామీణ ప్రాంతాల్లో, తండాల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ భాషా, డాక్టర్ చంద్రశేఖర్, సువెన్ కంపెని సభ్యులు ఎంపీ రమణ, జగపతిరాయుడు, సుధాకర్, రమణ, సురేష్, రమణ, వెంకట్‌రెడ్డి, సైదులు, శేషగిరి, లింగానాయక్ పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలి

జనరల్ ఆస్పత్రి ఎదుట రాస్తారోకో



సూర్యాపేట జనరల్ ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న ఆశా కార్యకర్తలు

సూర్యాపేట సిటీ, ఫిబ్రవరి 25: రోడ్డు ప్రమాదంలో మృత్యువాతపడిన ఎల్లమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని ఆమె కుటుంబ సభ్యులు, ఆశా కార్యకర్తలు డిమాండ్ చేశారు. సూర్యాపేట జనరల్ ఆస్పత్రి ఎదుట ఆదివారం ఆందోళనకు దిగారు. అర్వపల్లి మండలం తిమ్మాపురం గ్రామపంచాయతీ పరిధిలోని గోపాల్‌రెడ్డి నగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆశా కార్యకర్త ఎల్లమ్మ కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఆ మండలానికి చెందిన ఆశా కార్యకర్తలు, బంధువులు సూర్యాపేట జనరల్ ఆస్పత్రి ఎదుట ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఎల్లమ్మ మృతికి కారణమైన కారు డ్రైవర్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అందోళన తీవ్రతరం కావడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. మృతురాలి కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు ఆందోళన విరమించేది లేదని రోడ్డుపైన భీష్మించి కూర్చున్నారు. ఎల్లమ్మ మృతికి కారణాలను పరిశీలించి, మృతురాలి కుటుంబానికి న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

యాదగిరీశా.. నీవే దిక్కు!

- వేసవికి ముందే దంచుతున్న ఎండలు
- 36 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు



కొండపై ఎండలో గొడుగు నీడలో భక్తురాళ్లు

ఎంతో భక్తితో యాదగిరీశుడిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు ఎండ తీవ్రతకు అల్లాడిపోతున్నారు. వేసవి ప్రారంభానికి ముందే గొడుగులు వెంట తెచ్చుకోవాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొండపై సరైన వసతులు కల్పించకపోవడంతో, కాళ్లు కాలి.. మాడ మండుతోందని.. దర్శనానికి ముందే దేవుడు కన్పిస్తున్నాడని చెబుతున్నారు.
● (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

6

వేడుకగా లక్ష్మీతిరుపతమ్మ జాతర



పెన్‌పహాడ్, ఫిబ్రవరి 25: పెన్‌పహాడ్ మండలం చీదేళ్ల గ్రామంలో ఆదివారం శ్రీలక్ష్మీతిరుపతమ్మ గోపయ్య స్వాముల జాతర వేడుకగా కొనసాగింది. గ్రామంలో భక్తుల కోలాటాలు, భజనలు, డప్పు చప్పుళ్లతో గ్రామపుర వీధుల్లో ప్రభ బండ్ల ఊరేగింపు నిర్వహించారు. భక్తులు, ప్రభ బండ్లు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కోర్కెలను తీర్చే కొంగు బంగారంగా ప్రసిద్ధి చెందిన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. తంగెళ్ల గూడెం, చెట్ల ముకుందాపురం గ్రామాలనుంచి ప్రభ బండ్లతో భక్తులు ఆలయం వద్దకు చేరుకున్నారు. ఈ జాతరకు తెలుగురాష్ట్రాల భక్తులు అధిక సంఖ్యలో వచ్చారని నిర్వాహకులు తెలియజేశారు. తంగెళ్లగూడెంలో అమ్మవారి విగ్రహ ఊరేగింపు వేడుకగా నిర్వహించారు. మరో నాలుగురోజులపాటు జరిగే ఈ జాతరలో అధికసంఖ్యలో భక్తులు రానున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మోదుగు నర్సిరెడ్డి, వైస్ చైర్మన్ దేశగాని రాజీవ్ గాంధీ తెలిపారు. జాతరకు వస్తున్న భక్తులందరికీ అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. సూర్యాపేట రూరల్ సీఐ వై సురేందర్‌రెడ్డి, పెన్‌పహాడ్ ఎస్‌ఐ పెరిక రవీందర్ ఆధ్వర్యంలో జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పరెడ్డి సీతారాంరెడ్డి, ఎంపీటీసీ జూలకంటి వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెన్న సీతారాంరెడ్డి, ఉపసర్పంచ్ బీజీగా గోపి, కమిటీ సభ్యులు జాల సైదులు, గొట్టిపర్తి గోవింద్, కొండమీది పిచ్చయ్య, మా జీ ఎంపీటీసీ గుర్రం అమృతారెడ్డి, కీర్తి వెంకట్రాములు పాల్గొన్నారు.

యాదగిరీశా.. నీవే దిక్కు

- వేసవికి ముందే మండుతున్న ఎండలు
- యాదగిరి క్షేత్రంలో 37డిగ్రీలకు పైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు
- కార్పెట్‌లు, మ్యాట్‌లు ఏర్పాటు చేయాలని కోరుతున్న భక్తులు

యాదాద్రి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వేసవి ఆరంభం కాక ముందే యాదగిరిగుట్టలో ఎండలు మండుతున్నాయి. సాధారణంగా ఎండా కాలం మార్చి నెలాఖరు నుంచి మే చివరి వరకు ఉంటుంది. వాతావరణంలో వచ్చిన మార్పులతో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం వేళ మబ్బులు కమ్మినట్టుగా ఉన్నటువంటి వాతావరణం తొమ్మిది గంటలు కాగానే ఎండలు ప్రారంభమవుతున్నాయి. వారం రోజులుగా యాదగిరిగుట్ట మండలంలో గరిష్ఠ ఉష్ణోత్రలు 36డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి. ఈ నెల 22న 37.6డిగ్రీలు, 23న 36.5డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మహిమాన్విత స్వయంభూ యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామివారి ప్రధానాలయంతో పాటు ప్రాంగణమంతా కూడా కృష్ణరాతి శిలలతో నిర్మించారు. ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో ఆలయ ప్రాంగణంలో రాతి శిలల వేడికి భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. కొండపైన ఉక్కపోత, ఎండవేడిమికి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఫిబ్రవరిలోనే ఇలాంటి పిరిస్థితి ఉంటే.. ఏప్రిల్, మే నెలల్లో ఎలా ఉంటుందోనని భక్తులు ఆందోళన చెందుతున్నారు. ఎండవేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు కొండపై చలువ పందిళ్లు మార్చి నెలలోనే వేయాలని కోరుతున్నారు. భక్తులు దర్శన క్యూకాంప్లెక్స్‌ల నుంచి ప్రధానాలయ తూర్పు రాజగోపురం ద్వారా గర్భాలయంలోకి ప్రవేశిస్తున్నారు. క్యూకాంప్లెక్స్‌లో, ప్రధానాలయంలో ఉన్నంత వరకు ఎండల నుంచి భక్తులు ఉపశమనం పొందుతున్నారు. గర్భగుడిలో స్వామివారి దర్శనాంతరం పశ్చిమం వైపు ఉన్న సప్తతల మహారాజగోపురం, వేంచేపు మండపం నుంచి భక్తులు బయటకు రావాలి. అయితే ఆలయ ప్రాంగణమంతా రాతిబండలు ఉండటంతో ఎండకు అవి వేడెక్కుతున్నాయి. ఆలయ ప్రాంగణంలోని తిరువీధుల్లో మ్యాట్‌లు లేకపోవడంతో ఎండలకు రాతిబండలపై నడవలేక ఉరుకులు, పరుగులు తీస్తున్నారు. కొండపైన బస్టాండ్ వరకు కాలినడకన వెళ్లాలంటే భక్తులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కొండపైన భక్తులు నడిచేందుకు వైట్ పెయింట్ ఏర్పాటుచేశారు. అయితే భక్తులు తిరువీధుల్లో రాతిబండలపై నుంచి పాదరక్షకులు లేకుండా వైట్ పెయింట్‌పై నడవాలంటే తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. స్వామిదర్శనం అనంతరం శివాలయం పక్కన ఉన్నటుంటి ప్రసాదాల కౌంటర్‌కు, ప్రసాదాలను తీసుకుని బస్టాండ్‌కు చేరుకోవాలి. అయితే ఎండల నుంచి ఉపశమనం పొందేలా ఆలయ అధికారులు చలువ పందిళ్లు...మ్యాట్‌లను ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. ప్రధానాలయం ప్రాంగణంతో పాటు కొండకింద బస్టాండ్ వరకు కార్పెట్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. వీఐపీ టిక్కెట్ తీసుకుని దర్శనానికి వచ్చే భక్తుల కోసం తాత్కాలికంగా చలువపందిళ్లు ఏర్పాటుచేయగా, శివాలయం నుంచి బస్టాండ్ వరకు చలువపందిళ్లు ఏర్పాటుచేయాలని భక్తులు కోరుతున్నారు.


యాదగిరిగుట్టలో కొండపైన వీఐపీ దర్శనం కోసం విచ్చేసే భక్తుల కోసం ఏర్పాటుచేసిన చలువపందిళ్లు


పాతగుట్ట బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన చలువపందిళ్లు

మార్చి 11నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు షురూ..

భక్తజన బాంధవుడు లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాలు మార్చి 11వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాలకు రాష్ట్రవ్యాప్తంగా భక్తులు తరలివస్తారు. ఈ నేపథ్యంలో బ్రహ్మోత్సవాల ప్రారంభం నాటికైనా కొండపైన ఎండలకు ఉపశమనం పొందేలా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. ముక్కోటి దేవతలు ఆహూతులుగా లోకకల్యాణం.. విశ్వశాంతి కోసం అంగరంగవైభవంగా 11రోజుల పాటు జరిగే లక్ష్మీనరసింహుల తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు మార్చి 11న స్వస్తివాచనంతో ప్రారంభమై.. 21న అష్టోత్తర శతఘటాభిషేకం..శృంగార డోలోత్సవంతో పరిసమాప్తమవుతాయి. ఈ ఉత్సవాల నిర్వహణకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లను చేసేందుకు సన్నాహలు చేస్తున్నారు.

భక్తులు ఇబ్బంది పడకుండా చర్యలు



వేసవిలో భక్తులు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం. కొండపైన వైట్ పెయింట్‌తో పాటు కార్పెట్లు కూడా ఏర్పాటు చేయనున్నాం. వీఐపీ దర్శనాల కోసం విచ్చేసే భక్తుల కోసం చలువపందిళ్లు ఏర్పాటుచేస్తున్నాం. కొండపైన శివాలయం ముందుకు భక్తులు నడిచే దారిలో చలువపందిళ్లు వేయనున్నాం. అవసరమైతే కార్పెట్‌లు కూడా ఏర్పాటు చేస్తాం. తాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తాం. అవసరమైన ప్రాంతాల్లో మొబైల్ టాయిలెట్‌లు అందుబాటులో ఉంచుతాం.

\- రామకృష్ణారావు, యాదగిరిగుట్ట ఆలయ ఈవో

ప్రియుడితో కలిసి భర్త హత్య

- గుండెపోటుగా చిత్రీకరించే యత్నం
- భార్య అరెస్టు, పరారీలో ప్రియుడు
- సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండల కేంద్రంలో ఘటన

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 25 : ప్రియుడితో ఏకాంతంగా ఉండగా చూసిన భర్తను హత్య చేసి గుండెపోటుతో మృతి చెందినట్లు బంధువులను నమ్మించింది. అంత్యక్రియల సమయంలో మృతదేహంపై గాయాలను చూసిన బంధువులు భార్యను నిలదీయడంతో ఆమె బండారం బయటపడింది. సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండల కేంద్రంలో ఈ ఘటన జరిగింది. మేళ్లచెర్వు ఎస్‌ఐ పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన దివ్యాంగుడు నేర్నకంటి వీరగోపయ్య(32)కు కోదాడ మండలం గణపవరం గ్రామానికి చెందిన వీరకుమారితో ఏడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఐదేళ్ల కుమార్తె వినీత, మూడేళ్ల కుమారుడు వినయ్‌కుమార్ ఉన్నారు. వీరకుమారికి గ్రామానికి చెందిన వార్డు మెంబరు భర్త ఎస్‌కే సైదాహుస్సేన్‌తో మూడేళ్ల క్రితం వివాహేతర సంబంధం ఏర్పడింది. కుటుంబసభ్యులు పలుమార్లు మందలించినా ఆమెలో మార్పు రాలేదు. శనివారం వీరగోపయ్య ఓ వివాహ కార్యక్రమానికి వెళ్లి రాత్రి 11.30 గంటలకు ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో వీరకుమారి ప్రియుడు సైదాహుస్సేన్‌తో ఏకాంతంగా ఉంది. ఈ విషయం బయటకు తెలుస్తుందని ప్రియుడితో కలిసి భర్తపై దాడి చేసింది. వీరగోపయ్య కాళ్లను ప్రియుడు సైదాహుస్సేన్ పట్టుకోగా ముఖంపై దిండు అదిమి పట్టుకుని ఊపిరాడకుండా చేసి భర్తను హత్య చేసింది. భర్త గుండెపోటుతో ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడని బంధువులను నమ్మించింది. ఆదివారం సాయంత్రం అంత్యక్రియల ఏర్పాట్లలో భాగంగా వీరగోపయ్య మృతదేహానికి స్నానం చేయించడానికి చొక్కాను తీయగా శరీరంపై గాయాలు కనిపించాయి. అతడి బంధువులు వీరకుమారిపై దాడి చేసి గట్టిగా నిలదీయడంతో ప్రియుడి సాయంతో భర్తను హత్య చేశానని అంగీకరించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వీరకుమారిని అదుపులోకి తీసుకోవడంతో పాటు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరగోపయ్య అక్కలు నాగలక్ష్మి, రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్ల ఎస్‌ఐ తెలిపారు. ప్రియుడు పరారీలో ఉన్నాడని చెప్పారు.


వీరగోపయ్య(ఫైల్ ఫోటో)

అందాల అనుపు

● గౌతమ బుద్ధుడి చరిత్రకు సజీవ సాక్ష్యం ● కళ్లను కట్టిపడేసే ప్రకృతి సోయగం ● నాగార్జునసాగర్ నుంచి 10 కి.మీల దూరం

ఓవైపు ఎత్తయిన కొండలు.. మరోవైపు గలగలపారే కృష్ణమ్మ.. ఇంకోవైపు పచ్చదనంతో ఆకట్టుకునే పార్కులు.. ఇవన్నీ నాగార్జునసాగర్ పరిధిలోని అనుపు సొంతం. గౌతమ బుద్ధుడి కాలం నాటి చరిత్రను కళ్లకు కట్టినట్లు చూపే నిర్మాణాలు.. ఆచార్య నాగార్జునుడి చరిత్రను గుర్తుకు తెచ్చే కట్టడాలు చూడముచ్చటగొలుపుతున్నాయి. ప్రకృతి సోయగాలు, కృష్ణవేణి నీటి సవ్వడితో, పచ్చటి పచ్చిక బయళ్ల నడుమ చల్లటి గాలులలతో అలరారుతూ పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తోంది.


● నాగార్జునసాగర్




అనుపు వద్ద కృష్ణా తీరం

దేశ విదేశాలనుంచి పర్యాటకులు అనుపును సందర్శించడానికి ఏటా వేల సంఖ్యలో వస్తుంటారు. 2006లో అమరావతిలో జరిగిన ఓ కార్యక్రమానికి వెళుతూ బౌద్ధ మత గురువు దలైలామా అనుపులో ఓ మొక్కను కూడా నాటారు. దీంతో నాటినుంచి వివిధ దేశాల నుంచి వచ్చే బౌద్ధ పర్యాటకులు నాడు దలైలామా నాటిన మొక్కను సందర్శిస్తుంటారు. అంతర్జాతీయ బౌద్ధక్షేత్రంగా విరాజిల్లుతున్న అనుపు గురించి అందిస్తున్న ప్రత్యేక కథనం..

బౌద్ధమతానికి కేంద్ర బిందువు గౌతమ బుద్ధుడు. ఆయనకు సంబంధించిన ఎన్నో ఆనవాళ్లు నాగార్జునసాగర్‌లోనే చోటుచేసుకున్నట్లు చరిత్ర చెబుతోంది. వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ప్రాంతంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణంకోసం సర్వేలు చేశారు. 1956వ సంవత్సరానికి ముందు వరకు కృష్ణానది ప్రవహిస్తున్నా చుట్టుపక్కల మొత్తం దట్టమైన నల్లమల అటవి ప్రాంతంతో నిండి ఉండేది. నాటి ప్రధాని నెహ్రూ 1955లో నందికొండ ప్రాజెక్టు నిర్మాణానికి ఇక్కడే బాగుంటుందని ఎంపిక చేశారు. గౌతమ బుద్ధుని అనవాళ్లకు నెలవైన ఈ ప్రాంతంలోనే ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆ సమయంలో పలుచోట్ల ప్రాజెక్టు నిర్మాణం కోసం తవ్వకాలు జరిపారు. తవ్వకాల్లో గౌతమ బుద్ధుడి కాలం నాటి చరిత్రకు అద్దంపట్టే పలు వస్తువులను, బుద్ధుడి పాలరాతి విగ్రహాలను, ధాతువులు, పలు రకాల లోహపు వస్తువులు బయటపడ్డాయి. వీటిని భద్రపరిచేందుకు నాటి ప్రభుత్వం అనుపు నుంచి 14 కి.మీల. దూరంలో ఉన్న (ప్రస్తుతం జలాశయంలో ఉంది) నాగార్జునకొండ, అనుపులను ఎంపిక చేశారు. నాగార్జునకొండలో ప్రత్యేకంగా మ్యూజియాన్ని ఏర్పాటుచేసి నాటి చరిత్రకు అద్దంపట్టేలా ఉన్న వస్తువులను మ్యూజియంలో భద్రపరిచి ప్రత్యేకభద్రతను ఏర్పాటుచేశారు. మ్యూజియంలో బౌద్ధ కాలంనాటి పలు వస్తువులను, శిల్ప సంపద, నేటి తరానికి నాటి చరిత్ర అర్థమయ్యేలా పలు నిర్మాణాలు ఇక్కడ కనిపిస్తాయి. ఇక అనుపు ప్రాంతాన్ని పరిశీలిస్తే ఇక్కడ బుద్ధుని కాలంనాటి విద్యా వ్యవస్థను వివరించే విశ్వవిద్యాలయాన్ని పునర్నిర్మాణం చేశారు. అలనాటి క్రీడాప్రాంగణం, వసతిగృహాలు, ఆధ్యాత్మికంగా ఉండే విహారాలు, బౌద్ధమతం ప్రచారం, అప్పటి నిర్మాణాలు కళ్లను కట్టిపడేస్తుంటాయి. నాగార్జునసాగర్‌కు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో పల్నాడు జిల్లా మాచర్ల మండలంలో అనుపు అనే ప్రాంతం ఉంది.



అనుపు వద్ద పచ్చని కొండలు



బౌద్ధ మత కట్టడాలు

కళ్లకు కట్టిపడేసే ప్రకృతి సోయగం

అనుపు వద్ద ప్రకృతి సోయగం కళ్లకు కట్టిపడేస్తుంది. ఇక్కడ సుందర దృశ్యాలు కనువిందు చేస్తాయి. పురావస్తు శాఖ అభివృద్ధి చేసిన పునర్నిర్మిత కట్టడాలు, దానిచుట్టూ పెంచిన పచ్చదనం, ఎత్తయిన కొండలు, దూరంగా కనిపించే కృష్ణాతీరం, అద్భుతంగా ఉంటుంది. ఇక్కడ నాడు నిర్మించిన హంపీ స్టేడియం నమూనాలో నేటి ఎల్‌బీ స్టేడియాన్ని నిర్మించారు. హంపీ స్టేడియంలో నాడు మల్లయుద్ధాలు, ముష్టియుద్ధాలు జరిగేవని చరిత్ర చెబుతోంది. సాగర్‌కు వచ్చే ప్రతి పర్యాటకుడు తప్పనిసరిగా అనుపును సందర్శిస్తుంటారు.

వివిధ రూట్ల నుంచి చేరుకోండిలా..

హైదరాబాద్ నుంచి 160 కిలోమీటర్ల దూరంలో అనుపు ఉంటుంది. హైదరాబాద్ నుంచి బయలుదేరిన వారి నాగార్జునసాగర్‌లోని రైట్‌బ్యాంక్ జంక్షన్ వద్ద దిగి.. అక్కడి నుంచి ఆటోల్లో 10 కి.మీ. దూరంలో అనుపునకు చేరుకోవచ్చు. గుంటూరు నుంచి 150 కి.మీ.ల దూరంలో నాగార్జునసాగర్ ఉంటుంది. గుంటూరు నుంచి బయలుదేరిన వారు 130 కి.మీ.ల దూరంలో మాచర్లకు చేరుకొని.. అక్కడి నుంచి 20 కి.మీ.ల దూరంలో నాగార్జునసాగర్‌సాగర్‌కు చేరుకున్నాక.. రైట్‌బ్యాంక్ జంక్షన్ వద్ద దిగి.. అక్కడి నుంచి ప్రైవేట్ వాహనాల్లో 10 కి.మీ. దూరంలో ఉన్న అనుపునకు చేరుకోవాలి. నల్లగొండ నుంచి 60 కి.మీల దూరంలో ఉన్న సాగర్‌కు వయా హాలియా నుంచి రావాలి. సాగర్‌కు చేరుకున్నాక, అనుపునకు వెళ్లాలి. గుంటూరు నుంచి నాగార్జునసాగర్‌కు మూడున్నర గంటల ప్రయాణానికి రూ.220, హైదరాబాద్ నుంచి మూడున్నర గంటల ప్రయాణానికి నాగార్జునసాగర్‌కు రూ.250, నల్లగొండ నుంచి రెండు గంటల ప్రయాణానికి రూ.80గా ఆర్టీసీ బస్‌చార్జీలు వసూలు చేస్తుంది.

పాతగుట్ట బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం



పాతగుట్ట యాగశాలలో పూర్ణాహుతి పర్వాలను నిర్వహిస్తున్న అర్చకులు

● కల్యాణ లక్ష్మీనృసింహుడికి శాస్త్రోక్తంగా అష్టోత్తర శతఘటాభిషేకం

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 25: పాతగుట్ట లక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం ఉదయం స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర శతఘటాభిషేకంతో తిరుకల్యాణ బ్రహ్మోత్సవ విశేష ఘట్టాలు పరిసమాప్తమయ్యాయి. బ్రహ్మోత్సవాల్లో ఆసాంతం భక్తజనులను కటాక్షించేందుకు వివిధ వాహన సేవల్లో అనుగ్రహించిన లక్ష్మీనరసింహుడిని వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ అష్టోత్తర శత కలశాలతో అభిషేకించారు. పాతగుట్ట ముఖమండపంలో 108 కలశాలను ఏర్పాటు చేసిన అర్చకులు కలశాలలో గంగాది సప్తనదీ జలాలను, పంచామృతాలు, ఔషధాలతో నింపి దర్భ, మామిడి ఆకులను, కొబ్బరికాయలు, వస్త్రాలతో శోభాయమానంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా విశ్వక్సేన పూజలతో పుణ్యాహవాచనం చేపట్టి, యాగశాలలో నిత్య లఘు పూర్ణాహుతి నిర్వహించారు. వేదపండితులు, రుత్వికులు పంచసూక్తం, దశశాంతులు, నారాయణ సూక్తాలు, పంచోపనిషత్తుల పఠనాలు..ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల నడుమ పాతగుట్ట ప్రధానాలయంలోని స్వయంభువులను, కవచమూర్తులను, ఉత్సవమూర్తులను అష్టోత్తర శత కలశాలతో అభిషేకించారు. తులసి, వివిధ రకాల పూలతో అభిషేక మూర్తులను స్వామి, అమ్మవార్ల సహస్రనామాలతో అర్చించారు. ఈ వైశేషిక బ్రహ్మోత్సవ ఘట్టాలను శ్రీవైష్ణవ పాంచరాత్రగమ శాస్త్రరీతిలో ప్రధానార్చకులు నల్లన్‌ధిఘళ్ లక్ష్మీనరసింహచార్యులు, కాండూరి వెంకటచార్యులు, అర్చక, రుత్విక బృందం నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈవో రామకృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో చతుర్వేద, దివ్యప్రబంధ, క్షేత్రమహాత్య్మ పారాయణాలు, మూలమంత్ర, మూర్తి మంత్ర జపాలు, హోమపూజలు నిర్వహించిన రుత్వికస్వాములను అష్టోత్తర శతఘటాభిషేక పూజలనంతరం ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈవో రామకృష్ణారావులు ఘనంగా సన్మానించారు.

నేటి నుంచి నిత్య మొక్కుకల్యాణాలు

పాతగుట్ట లక్ష్మీనారసింహుడి సన్నిధిలో బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 19వ తేదీ నుంచి 25వ తేదీ వరకు స్వామివారి మొక్కు, శాశ్వత నిత్యకల్యాణాలు, పలు ఆర్జిత సేవలను దేవస్థాన అధికారులు నిలిపివేశారు. ఆదివారం అష్టోత్తర శతఘటాభిషేకంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. దీంతో సోమవారం నుంచి తిరిగి భక్తులు నిర్వహించుకునే శాశ్వత, మొక్కు నిత్యకల్యాణాలు, ఆర్జిత సేవా కైంకర్యాలు ఆరంభం కానున్నట్టు దేవస్థాన అధికారులు తెలిపారు.

యాత్రాజనుల సందడి



ప్రధానాలయంలో దేవదేవుడి దర్శనాల కోసం వేచిఉన్న భక్తులు

యాదగిరిగట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఆదివారం యాత్రాజనుల సందడి నెలకొంది. వారాంతపు సెలవు రోజు కావడంతో పలు ప్రాంతాల నుంచి భక్తులు తండోపతండాలుగా దేవదేవుడి దర్శనాల కోసం తరలివచ్చారు. మేడారం మహాజాతరకు వెళ్లిన భక్తులు తిరుగు ప్రయాణంలో యాదగిరీశుడిని దర్శించుకోవడం ఆనవాయితీ వస్తున్న ఆచారం. క్షేత్ర సందర్శనకు విచ్చేసిన భక్తజనుల హరిహరుల నామస్మరణలతో క్షేత్రం ఆధ్యాత్మికతతో వెల్లివిరిసింది. ఆలయ తిరువీధులు, ఆర్జిత సేవా మండపాలు భక్తులతో కోలాహలంగా కనిపించాయి. ఉభయ దర్శనాల క్యూలైన్లు, ప్రసాదాల విక్రయశాల వద్ద క్యూలైన్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. కొండకింద కల్యాణకట్టలో మొక్కుతలనీలాలు సమర్పించిన యాత్రీకులు లక్ష్మీపుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి కొండపైకి స్వామివారి దర్శనాల కోసం ఉచిత బస్సులు, తమతమ వాహనాల్లో తరలివచ్చారు. ఉభయ దర్శనాల క్యూలైన్లలో భక్తులు గంటల తరబడి వేచివుండి కొండగుహలో కొలువైన ఇష్టదైవాన్ని దర్శించుకున్నారు. స్వామివారి ధర్మ దర్శనాలలో సుమారు 4గంటలు..ప్రత్యేక దర్శనాలలో 2గంటల సమయం పట్టిందని, సుమారు 35వేల మందికి పైగా భక్తులు ఆలయాన్ని సందర్శించినట్టు, ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.48,96,311 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు.

స్వామికి శాస్త్రోక్తంగా నిత్యారాధనలు



కొండపైన లక్ష్మీనృసింహులు నిత్యకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరివాసుడికి ఆదివారం నిత్యారాధనలు ఆగమ శాస్త్రరీతిలో వైభవంగా కొనసాగాయి. సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపిన ఆచార్యులు గర్భాలయంలోని స్వయంభువులను, ప్రతిష్టా అలంకారమూర్తులను పంచామృతాలతో అభిషేకించి తులసి దళాలతో అర్చనలు జరిపారు. ప్రధానాలయ అష్టభుజి ప్రాకార మండపంలో విశ్వక్సేనుడికి తొలి పూజలతో సుదర్శన హోమం, నిత్యతిరుకల్యాణోత్సవాలను ఆగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. కొండపైన శివాలయంలో రామలింగేశ్వరుడి నిత్య పూజలు శైవాగమ పద్ధతిలో వైభవంగా కొనసాగాయి. సాయంత్రం ప్రధానాలయంలో అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు సంప్రదాయరీతిలో నిర్వహించారు.

స్వామివారి సేవలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర

యాదగిరీశుడిని ఆదివారం రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆయన ప్రధానాలయంలోని స్వయంభువులను దర్శించుకుని ముఖమండపంలో ఉత్సవమూర్తుల చెంత సువర్ణ పుష్పార్చన పూజల్లో పాల్గొన్నారు. ప్రాకార మండపంలో అర్చకులు ఆయనకు ఆశీర్వచనం జరపగా..దేవస్థాన అధికారులు ఆయనకు స్వామివారి అభిషేకం లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

బ్రహ్మోత్సవాలతో ఆధ్యాత్మిక శోభ

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 25 : మండలంలోని గోపలాయపల్లి వారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానంలో వార్షికబ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి గరుడసేవ నిర్వహించారు. ఉదయం ఆలయ మహామంటపంలో హోమం, బలిహారణం చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన గరుడ వాహనంపై ఉత్సవమూర్తులను ఆలయ వీధుల్లో ఊరేగించారు. వేడుకలో ఆలయ అనువంశిక ధర్మకర్త కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి,రాజేశ్వరి దంపతులు,సిబ్బంది సింహాచలం, వేణు, మత్స్యగిరి, నాగరాజు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

కనగల్ : మండలంలోని పగిడిమర్రిలోని గోవిందాంబసమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులు వడిబియ్యం, కట్నకానుకలను సమర్పించి మొక్కులు చెల్లించారు. మాజీ సర్పంచ్‌లు గోలి నర్సిరెడ్డి దంపతులు, గోలిజగాల్‌రెడ్డి దంపతులు వేర్వేరుగా పట్టు వస్త్రాలు, తలంబ్రాలను అందజేశారు. సాయంత్రం గ్రామంలో రథోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎర్రమాద యశోదమ్మ, నాయకులు సుంకిరెడ్డి రవీందర్‌రెడ్డి, సింగం సత్తయ్య, వెంకట్‌రెడ్డి, మల్లేష్, సైదులు, వెంకన్న, చంద్రశేఖర్‌రెడ్డి, నర్సింహ, రవీందర్, కృష్ణారెడ్డి, షణ్ముఖాచారి, భూషణాచారి, నర్సింహాచారి పాల్గొన్నారు.

మారేపల్లిలో వేంకటేశ్వరస్వామి..

హాలియా : మండలంలోని మారేపల్లి గ్రామంలోని శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహోత్సవాల సందర్భంగా ఆదివారం తెల్లవారుజామున స్వామివారి తిరుకల్యాణాన్ని కన్నులపండుగా నిర్వహించారు. అదేవిధంగా తలంబ్రాలు, గజవాహన సేవ, ఆరగింపు, తీర్థప్రసాద వినియోగం, గరుడ సేవ, పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. యాదగిరిగుట్ట మాజీ ప్రధాన అర్చకులు కారంపూడి లక్ష్మీనర్సింహాచార్యులు స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది. సాయంత్రం గ్రామ పురవీధుల్లో కోలాటాలు, డప్పు వాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు అంగరంగవైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో అనుముల మండల వైస్ ఎంపీపీ మాలే అరుణసత్యనారాయణరెడ్డి, దేవాలయ అధికారి అంబటి నాగిరెడ్డి, చైర్మన్ మట్టపల్లి వెంకన్న, గంగుల వెంకన్న, శ్రీకాంత్, బర్పటి సరిత, శ్రీను, మెండే ఏడుకొండలు, వెంకటేశ్వర్లు, అశోక్, చక్రపాణి పాల్గొన్నారు.



మారేపల్లిలో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

ఘనంగా దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన

చిట్యాల రూరల్ : మండలంలోని బొంగోనిచెర్వు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో గణపతి, నంది, జంట నాగులు, నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయా విగ్రహాలు, ఆలయాల దాతలు వెలిమినేటి నర్సిరెడ్డి, పన్నాల నీరజ, మహేందర్‌రెడ్డి, వెలిమినేటి సబిత, బుచ్చిరెడ్డి, కళమ్మ, బొబ్బలి స్వర్ణలత, వెంకటేశ్వర్‌రెడ్డిలను పూజారులు, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సామిడి సాయికుమార్, సామిడి మోహన్‌రెడ్డి, ఏనుగు గోపాల్‌రెడ్డి, సత్తిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, ఎంపల్ల పద్మ, రమణమ్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పగిడిమర్రిలో వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

ముత్యాలమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవం

అడవిదేవులపల్లి: మండలంలోని చిట్యాల గ్రామంలోని ముత్యాలమ్మ అమ్మవారి ప్రథమ వార్షికోత్సవాన్ని భక్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి బోనాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. అమ్మవారి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అంకాల కాశయ్య, నాగేశ్వర్‌రావు, గోపి, నాగేశ్వర్‌రావు, ఏడుకొండలు పాల్గొన్నారు

కుంభాభిషేకం

దేవరకొండ / చందంపేట : పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో ద్వితీయ పుష్కర కుంభాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ పాల్గొన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ చందంపేట మండల అధ్యక్షుడు ముత్యాల సర్వయ్య, నాయకులు నీల రవికుమార్, బోయపల్లి శ్రీనివాస్ గౌడ్, రమావత్ మోహన్‌కృష్ణ, గోసుల అనంతగిరి, కేతావత్ శంకర్‌నాయక్, రమావత్ తులసిరాం, బొడ్డుపల్లి కృష్ణ, సత్యనారాయణ, వడ్త్య బాలు, రవి, సైదులు, అంజి, రాంరెడ్డి, చంద్రమౌళి పాల్గొన్నారు. అదేవిధంగా చందంపేట మండలం పెద్దమూల గ్రామంలోని సీతారామచంద్రస్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ పాల్గొన్నారు



బస్సు ఎక్కుతున్న మహిళలు

కిటకిటలాడిన నార్కట్‌పల్లి బస్టాండ్

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 25 : నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆదివారం ప్రయాణికులతో కిటకిటలాడింది. మేడారం జాతరకు బస్సు సర్వీసులను పంపించారు. దీంతో బస్సుల కొరతతో బస్‌స్టేషన్‌కు ఏ రూట్ నుంచి వచ్చిన బస్సైనా ప్రయాణికులతో కిక్కిసిరి కనిపించాయి. ఏబస్సులో చూసినా 90 శాతం మంది మహిళా ప్రయాణికులే ఉన్నారు. ఆదివారం సెలవురోజు కావడం శుభకార్యాలు ఎక్కువగా ఉండటంతో ప్రయాణికుల సంఖ్య మరింత పెరిగింది. చంటిపిల్లలు, చేతి సంచులు, బ్యాగులతో మహిళలు బస్సులు ఎక్కలేక, గమ్యస్థానాల్లో దిగలేక నానాఅగచాట్లు పడ్డారు. నార్కట్‌పల్లి బస్టాండ్ నుంచి నల్లగొండ, సూర్యాపేట, హైదరాబాద్, భువనగిరి రూట్లలో వెళ్లే బస్సులన్నీ ప్రయాణికులతో కిక్కిరిసాయి. బస్సు ఫుట్‌బోర్డు వరకు నిలబడి వేలాడుతూ ప్రమాదం అంచున ప్రయాణించారు. ఇదిలా ఉండగా ప్రైవేటు వాహనాల్లో వెళ్దామనుకున్నా అవీ కూడా అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులతో నార్కట్‌పల్లి బస్టాండ్ ప్రాంగణం కిటకిటలాడింది.



ప్రయాణికులతో కిక్కిరిసిన బస్టాండ్

ప్రాణాంతకమైన ఫార్మా కంపెనీ మాకొద్దు

● ఉన్న పరిశ్రమలతో అనేక ఇబ్బందులు



సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలో ఇన్నోవేరా పరిశ్రమకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న దొండపాడు గ్రామస్థులు

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 25: ప్రాణాంతకమైన విషవాయువులు వెదజల్లే ఇన్నోవేరా ఫార్మా కంపెనీకి వ్యతిరేకంగా సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం దొండపాడు గ్రామస్థులు నిరసన తెలిపారు. దొండపాడు గ్రామంలో రూ.400 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న ఇన్నోవేరా ఫార్మా కంపెనీకి వ్యతిరేకంగా ఆ గ్రామస్థులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ2019 సంవత్సరంలో ఎస్‌డీఆర్, ఎస్‌ఆర్‌ఆర్ ఫార్మా కంపెనీ నిర్మించాలనుకున్నప్పటకీ, ఆ ఫార్మా కంపెనీకి వ్యతిరేకంగా గ్రామస్థులందరం నిరసన తెలిపాన్నారు.దాంతో ఆ కంపెనీ వెనక్కి వెళ్లిందని, మళ్లీ ఇప్పుడు కొత్తగా అదే స్థలంలో స్థానికులకు కనీస సమాచారం ఇవ్వకుండా ప్రజాభిప్రాయ నిర్వహించకుండా ఈ కంపెనీకి మంత్రులు ఎలా శంకుస్థాపన చేస్తారని నిలదీశారు. సిమెంట్ కంపెనీలు, ఫార్మా కంపెనీలతో ఆ ప్రాంతంలో గాలి, నీరు కలుషితమైందని, ఇప్పుడు కొత్తగా నిర్మించే ఫార్మా కంపెనీతో గ్రామానికి మరింత హాని జరుగుతుందన్నారు. ఈ కంపెనీకి వ్యతిరేకంగా గ్రామస్థులందరం కలిసి కట్టుగా ఉద్యమం చేస్తామని, ప్రజారోగ్యానికి హాని కలిగించే పరిశ్రమలు తమకు వద్దని ముక్తకంఠంతో నినదించారు. కార్యక్రమంలో దొండపాడు గ్రామానికి చెందిన పలువురు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌రెడ్డి ఎంపికతో జర్నలిస్టులకు న్యాయం

హుజూర్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 25: రాష్ట్ర మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి ఎంపికతో రాష్ట్రంలోని జర్నలిస్టులకు న్యాయం జరుగుతుందని టీయూడబ్ల్యూజే-ఐజేయూ జిల్లా అధ్యక్షులు కోలా నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటుచేసిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీనియర్ జర్నలిస్టుగా, ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ అధ్యక్షుడిగా, పత్రిక సంపాదకుడిగా పనిచేసిన శ్రీనివాసరెడ్డి గతంలో ప్రెస్ అకాడమి చైర్మన్‌గా పనిచేసి, రెండోసారి చైర్మన్‌గా ఎన్నిక కావడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో ఎన్.నరేందర్, బసవోజు శ్రీనివాసాచారి, ధేనమకొండ శేషంరాజు, కీతా రామనాథం, పిల్లలమర్రి శ్రీనివాస్, దేవరం రామిరెడ్డి, వెంకటరెడ్డి, జానీబాషా, ఇందిరాల రామకృష్ణ, ఇట్టిమళ్ల రామకృష్ణ, షేక్ నాగుల్‌మీరా, ఆర్పీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల: ప్రెస్ అకాడమి చైర్మన్‌గా ఐజేయూ నాయకుడు శ్రీనివాసరెడ్డిని నియమించడంపై టీయూడబ్ల్యూజే నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ విలేకరుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు దొంతిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు టీఎస్‌స్వామి, కోశాధికారి గుంటూరు రాము, నాయకులు గోపాలకృష్ణ, బుడిగె శంకర్, చామకూరి వీరయ్య, ఈగ శ్రీనివాసరావు, అలుక సైదిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

సూర్యాపేట టౌన్: తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్‌గా ఐజేయూ జాతీయ అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై టీయూడబ్ల్యూజే(ఐజేయూ)నాయకులు జిల్లా కేంద్రంలో బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చలసాని శ్రీనివాసరావు, మిక్కిలినేని శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బంటు కృష్ణ, బత్తుల మల్లికార్జున్, కొండ శ్రీనివాసరావు, ఉయ్యాల నర్సయ్య, జహీర్, నజీర్, మల్లేష్ పాల్గొన్నారు.

తుంగతుర్తి: ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా కె.శ్రీనివాస్‌రెడ్డి ఎంపిక కావడంపై తుంగతుర్తి టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎస్.రవీందర్‌శర్మ హర్షం వ్యక్తం చేశారు.



హుజూర్‌నగర్‌లో మాట్లాడుతున్న కోల నాగేశ్వరరావు

డీఆర్‌డీఏలో ఉద్యోగినిపై వేధింపులు

● కలెక్టర్‌కు పిర్యాదు ● విచారణకు ఆదేశం

సూర్యాపేట(కలెక్టరేట్), ఫిబ్రవరి 25: సూర్యాపేట జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ(డీఆర్‌డీఏ)లో ఉద్యోగినిపై సంబంధిత శాఖలో విధులు నిర్వహిస్తున్న ఓ అధికారి వేధింపులకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. డీఆర్‌డీఏలో సోషల్ ఆడిట్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగినిని డీఆర్‌డీఏలో హెచ్‌ఆర్ విభాగంలో కీలక స్థానంలో విధులు నిర్వహిస్తున్న అధికారి అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు కావాలనే ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు సమాచారం. గతంలో కూడా సంబంధిత మహిళా ఉద్యోగినిని సదరు అధికారి వేధింపులకు గురిచేయగా, ఆ సమయంలో ఆ ఉద్యోగిని, సంబంధిత శాఖ జిల్లా అధికారి దృష్టికి తీసుకెళ్లగా ఎలాంటి చర్యలు తీసుకోకుండా వదిలివేసినట్లు తెలిసింది. ఇటీవల ఆ మహిళా ఉద్యోగినిపై మరోసారి వేధింపులు, అసభ్య పదజాలంతో మాట్లాడడం తో ఆ ఉద్యోగిని కలెక్టర్ వెంకట్రావ్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. దీంతో ఈ విషయమై పూర్తి స్థాయిలో విచారణ జరిపి నివేదిక అంద జేయాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారి వెంకట రమణను కలెక్టర్ ఆదేశించారు.

బూరుగడ్డ గ్రామంలో ఇంట్లో చోరీ

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 25: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డ గ్రామంలో ఆర్‌ఎంపీ ఇంట్లో ఆదివారం చోరీ జరిగింది. ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బూరుగడ్డ గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ రాంబాబు అనారోగ్యం బారిన పడటంతో మూడు రోజుల క్రితం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. రాంబాబు, భార్యతో ఆదివారం ఇంటికి రాగా, ఇంటి తలుపులు, బీరువా ధ్వంసం చేసి ఉన్నాయి. బీరువాలో దాచిన రూ.13లక్షలు చోరీకి గురయ్యాయని రాంబాబు భార్య మమత పోలీసులకు ఫిర్యాదు చేఉసింది. సీఐ చలమందరాజు, ఎస్‌ఐ ముత్తయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జ్ఞానీస్ యోగశాల విద్యార్థులు ప్రతిభ

సూర్యాపేటటౌన్, ఫిబ్రవరి 25: హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో సిద్దిపేటలో ఆదివారం జరిగిన స్టేట్ లెవెల్ సూర్య నమస్కార పోటీల్లో ఆదివారం జిల్లా కేంద్రానికి చెందిన జ్ఞానీస్ యోగశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. 1000 సూర్య నమస్కార పోటీల్లో గూడూరు నాగేశ్వర్‌రావు మొదటి బహుమతి, 900 సూర్యనమస్కార పోటీల్లో దేశగాని ఉప్పలయ్య తృతీయ బహుమతి, 108 సూర్య నమస్కార పోటీల్లో ముదిరెడ్డి నరేందర్‌రెడ్డి, నారాయణ సురేష్‌రెడ్డి, మొలుగూరు సోమశేఖర్, గట్టి గొర్ల మధుబాబు బంగారు పతకాలు సాధించారు. విజేతలకు హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఇన్‌చార్జి గోవర్ధన్‌గిరి, ఎంపీ రంగారావు అవార్డులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. విజేతలను జిల్లా కేంద్రానికి చెందిన పలువురు అభినందించారు.

వైభవంగా లక్ష్మీనృసింహుని కల్యాణం



చౌటపల్లిలో వేణుగోపాలుడి రథోత్సవం

అర్వపల్లి, ఫిబ్రవరి 25: మండల కేంద్రంలోని శ్రీయోగనందలక్ష్మీనృసింహుడి కల్యాణాన్ని శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు అర్చకులు అంగరంగ వైభవంగా చేశారు. నరసింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మికి ఎదుర్కోళ్ల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాలను పుర వీధుల్లో ఊరేగించారు. కల్యాణాన్ని వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు ఆదివారం తెల్లవారుజాము వరకు కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. స్వామిఅమ్మవార్లకు ఎమ్మెల్యే మందుల సామేల్, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించి, కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. తలంబ్రాలను కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దరూరి యోగనందచార్యులు, ఆలయ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, సామ అభిషేక్‌రెడ్డి, మోరపాక సత్యం, దేవాదాయ శాఖ జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, బైరబోయిన సైదులు స్వామివారికి సమర్పించారు. కార్యక్రమంలో అర్చకులు రాంబాబు, పవన్, గుడిపాటి నర్సయ్య, రత్నం లక్ష్మాజీ పాల్గొన్నారు.

కన్నుల పండువగా శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణం

హుజూర్‌నగర్: పట్టణ పరిధిలోని ఫణిగిరి గట్టు వద్ద స్వయంభు శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో ఆదివారం తెల్లవారుజామున శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణం జరిగింది. పూజారులు నరగిరినాథుని నర్సింహాచార్యులు, వేదాంతం మోహనాచార్యులు ఆధ్వర్యంలో భక్తుల జయజయ ధ్వానాల మధ్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.. స్వామివారికి దేవాదాయ శాఖ నుంచి ఈవో గుజ్జుల కొండారెడ్డి, పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు.. కల్యాణం సందర్భంగా భక్తి గీతాలాపన చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కొండారెడ్డి, నర్సింహాచార్యులు, రంగభట్రాచార్యులు, నారాయణ చార్యులు, రామకృష్ణమాచార్యులు, దామోదరాచార్యులు, జగన్నాథాచార్యులు పాల్గొన్నారు.



బరాఖత్‌గూడెంలో గుర్రంపై ఊరేగుతున్న వేంకటేశ్వరుడు

●ఫణిగిరి గట్టు వద్ద స్రీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన పూజల్లో హుజూర్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యామ్ కుమార్ దంపతులు పాల్గొన్నారు. . ఆలయ మర్యాదలతో జడ్జిని ఈ ఈవో కొండారెడ్డి సన్మానించారు.

నందగోపాలుడి పరిణయోత్సవం

మఠంపల్లి: మండలంలోని చౌటపల్లి గ్రామంలో రుక్మిణి, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు కొనసాగు తున్నాయి. శనివారం అర్ధరాత్రి నందగోపాలుడి పరిణయోత్సవాన్ని వేదపండితుడు చివుకుల పద్మనాభాచార్యులు నేతృత్వంలో వేలాదిమంది భక్తుల నడుమ కన్నుల పండువగా నిర్వహించారు. యాజ్ఞీకుల ఆధ్వర్యంలో కల్యాణ మూర్తులకు ఎదుర్కోళ్ల ఉత్సవం, రథోత్సవం నిర్వహించారు. ఆదివారం రాత్రి స్వామివారి పవళింపు సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు చైర్మన్ సింగారపు సైదులు, ఈవో ఎంపీ లక్ష్మణారావు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వీరారెడ్డి, మల్లేశ్వరి, శివయ్య, సింగారపు శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు అరుణసైదులు, అర్చకులు నరగిరినాథుని రామకృష్ణాచార్యులు, ఆలయ, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అర్వపల్లిలో నృసింహుని కల్యాణాన్ని తిలకిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి



ఫణిగిరిగట్టు వద్ద కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వేంకటేశ్వరస్వామి-పద్మావతి కల్యాణం

మునగాల రూరల్: మండలంలోని బరాఖత్‌గూడెంలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం రాత్రి స్వామివారు, పద్మావతి అమ్మవార్ల కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో కల్యాణాన్ని జరిపించారు. ఓరుగంటి రవి, సామేలు కరుణాకర్‌రెడ్డి ప్రభలు ఏర్పాటు చేసి డ్యాన్సులు ఏర్పాటు చేశారు.



అర్వపల్లిలో నృసింహుని కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



మఠంపల్లి మండలం చౌటపల్లిలో వేణుగోపాలస్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు



ఫణిగిరి గట్టువద్ద ఎదుర్కోళ్ల ఉత్సవంలో పాల్గొన్న అధికారులు, భక్తులు

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి



చిన్నీని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

కోదాడ, ఫిబ్రవరి 25: గ్రామ స్థాయి నుంచి టీడీపీ బలోపేతానికి కార్యకర్తలు , నాయకులు కృషి చేయాలని ఆ పార్టీ విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి కేశినేని చిన్ని సూచించారు. ఆదివారం కోదాడకు వచ్చిన ఆయనను టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎస్‌ఆర్‌ఎం పాఠశాలలో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణాలో టీడీపీకి బలమైన క్యాడర్ ఉందన్నారు. రానున్న పార్లమెంట్, ఏపీలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ విజయానికి కార్యకర్తలు, నాయకులు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముత్తినేని సైదేశ్వరరావు, నంబూరి సూర్యం, ఉప్పగండ్ల శ్రీనివాసరావు, ఉన్నం హనుమంతరావు, పోటు కోటేశ్వరరావు, పిట్టల శోభన్‌బాబు, రేవంత్‌రెడ్డి, సజ్జా రామ్మోహన్‌రావు, ఏటుకూరి సురేష్, వక్కవంతుల పూర్ణచందర్‌రావు, నల్లపునేని కృష్ణారావు, షేక్ అబీబ్, షేక్ బాబా, సోమపంగు సహదేవ్, మాదాల రాంబాబు, నెల్లూరు వెంకటేశ్వర్లు, మర్రా రమేష్, బాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

సూర్యాపేటఅర్బన్, ఫిబ్రవరి 25: ప్రభుత్వాలు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ధర్మభిక్షం భవన్‌లో అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రపంచంలోనే యువకుల సంఖ్య ఎక్కువగా ఉన్న భారతదేశంలో యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేవన్నారు. ఉద్యోగాలను భర్తీ చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటనలు చేస్తున్నప్పటికీ అవి అమలు కావడంలేదన్నారు. నేడు జిల్లా కేంద్రంలో ఢిల్లీలో రైతులు చేస్తున్న ఉద్యమానికి మద్దతుగా నిరసన ర్యాలీ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు చేపూరి కొండల్, చిలకరాజు శ్రీను, అనంతుల మల్లీశ్వరి, బూర వెంకటేశ్వర్లు, ఏడెల్లి శ్రీకాంత్, అనంతుల రాము, కడారు మధు, సయ్యద్, ఫయాజ్‌మియా, వీరన్న, లింగరాజు, శ్రీను, రవి పాల్గొన్నారు.

మండల అభివృద్ధే ధ్యేయం: ఎంపీపీ

గరిడేపల్లి, ఫిబ్రవరి 25: మండల సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎంపీపీ పెండెం సుజాత శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఇంద్రపల్లి ముత్యాలమ్మ బజారులో సీసీ రోడ్డు పనులకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.20లక్షలతో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సహకారంతో మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. మండల కేంద్రంలో ప్రతి బజారులో సీసీ రోడ్డు నిర్మించామని, వేసవి కాలం వస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు ఆమె తెలిపారు కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పయిడిమర్రి రంగనాథ్, మాజీ జడ్పీటీసీ పెండెం శ్రీనివాసగౌడ్, ముత్యాలు, లక్ష్మారెడ్డి, నవీన్, అఖిల్, కొలిపాక కృష్ణ, భాస్కర్, సైదులు, వెంకన్న, నాగయ్య, కాశయ్య, వెంకటరెడ్డి, సీతారాంరెడ్డి, హుస్సేన్, నాగేశ్వరరావు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల మండల అధ్యక్షుడిగా హనుమంత్

అనంతగిరి, ఫిబ్రవరి 25: మండల గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్స్ యూనియన్ కమిటీ సభ్యులు ఆదివారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యపై చర్చించుకున్నారు. అనంతరం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సోమపంగు రాధాకృష్ణ ఆదేశాల మేరకు నూతన కమిటీని ఎన్నుకున్నారు. మల్టీపర్పస్ వర్కర్ యూనియన్ అనంతగిరి మండల అధ్యక్షుడిగా డేగ హనుమంతు, ఉపాధ్యక్షుడిగా పద్మ, కార్యదర్శిగా తమలపాకుల విజయ, కోశాధికారిగా గుండు సురేష్, సహాయ కార్యదర్శిగా జక్కం చంద్రంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపై ఎల్లప్పుడూ ముందుంటామని, కార్మికుల్లో ఎవరికి ఆపద వచ్చిన వెంటనే ఆదుకుంటామని తెలిపారు. కార్మికులందరూ సంఘటితంగా ఉంటూ సంఘం బలోపేతానికి కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో మల్టీపర్పస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణ సంస్థ జిల్లా చైర్మన్‌గా బాలనాగు

మఠంపల్లి, ఫిబ్రవరి 25: మానవ హక్కుల పరిరక్షణ సంస్థ జిల్లా అధ్యక్షుడిగా మఠంపల్లి మండల కేంద్రానికి చెందిన మామిడి బాలనాగును నియమించారు. ఈ మేరకు సంస్థ రాష్ట్ర చైర్మన్ డెక్కేటి శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బాలనాగు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సంస్థ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించినవారికి కృతజ్ఞతలతు తెలిపారు.

నిరుపేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలి: సీపీఎం

గరిడేపల్లి, ఫిబ్రవరి 25: నిరుపేదలకు ప్రభుత్వం ఇంటి స్థలాలతో పాటు, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి షేక్ యాకుబ్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండల పరిధిలోని మంగాపురంలో జరిగిన సీపీఎం గ్రామ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయాలన్నారు. ఆరు గ్యారంటీలతో పాటు ఇందిరమ్మ ఇళ్లను కూడా కేటాయించాలనిని ఆయన డిమాండ్ చేశారు.

గత ప్రభుత్వం మాదిరిగా ప్రజలను మభ్య పెడితే పార్టీ ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తామని, ప్రజా ఉద్యమాల ద్వారా హామీల అమలును సాధిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాచమళ్ల రామస్వామి, పంతులు, లాలు, నిర్మల, సైదమ్మ, లక్ష్మి, నాగయ్య, పద్మ, కోటియా, మంగయ్య, భీమ్లా తదితరులు పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలి



కోదాడలో ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) నాయకులు

కోదాడ టౌన్, ఫిబ్రవరి 25: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కోదాడ నియోజకవర్గంలో జరిగిన అవినీతిపై, ప్రభుత్వ భూముల కబ్జాలపై సిటింగ్ జడ్జితో కమిటీ వేసి విచారణ చేయించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్(ప్రజాపంథా) జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ కోరారు. ప్రజాపంథా ఆధ్వర్యంలో ఆదివారం కోదాడ బస్‌స్టేషన్ సమీపంలోని గాంధీ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ తొమ్మిదిన్నర ఏళ్ల కాలంలో ఆ పార్టీ నాయకులు, కాంట్రాక్టర్లు, అధికారులు కలిసి అవినీతికి పాల్పడ్డారని, అభివృద్ధి పనులను నాసిర కంగా చేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని, ప్రభుత్వ భూములను కబ్జా చేసి రియల్ ఎస్టేట్ పేరుతో వెంచర్లు చేసి వందల కోట్లు ఆర్జించారని ఆరోపించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో జరిగిన అవినీతిపై సిట్టింగ్ జడ్జితో కమిటీ వేసి విచారణ చేయించి, కబ్జా చేసిన భూమిని గుర్తించి పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి మట్టిపల్లి అంజన్న, పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి వీరబోయిన రమేష్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, జిల్లా నాయకులు సయ్యద్, పీవైఎల్ జిల్లా నాయకుడు వాస కరుణాకర్, గూగుల్ వీరబాబు, లక్ష్మన్న పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనం ఇవ్వాలి

కోదాడ రూరల్, ఫిబ్రవరి 25: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.రాధాకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్ల యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అంగన్‌వాడీ టీచర్ల సమ్మె కాలంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. అంగన్‌వాడీ టీచర్‌కు రిటైర్‌మెంట్ బెనిఫిట్ కింద రూ.5 లక్షలు, ఆయాకు రూ. 3లక్షలు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న రూమ్‌రెంట్స్, టీఏ, డీఏలు ఇవ్వాలని, పనిభారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను కూడా అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు వర్తింపజేయాలన్నారు. అనంతరం పలువురు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా హేమలత, కార్యదర్శిగా రాధతో పాటు 10మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి ముత్యాలు, బుజ్జమ్మ, శాంతాబాయి, గంగ, రాంబాయి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ

హుజూర్‌నగర్ అభివృద్ధికి రూ.1.50 కోట్లు మంజూరు

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 25: నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సహకారంతో పట్టణంలోని టౌన్‌హాల్‌ను అప్‌గ్రేడ్ చేసేందుకు రూ.1 కోటి, క్రిస్టియన్ శ్మశాన వాటిక అభివృద్ధికి రూ.50లక్షలు మంజూరు చేసినట్లు మునిసిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చనరవి, పార్టీ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్‌రావు తెలిపారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పట్టణంలోని టౌన్‌హాల్‌ను ఆధునికీకరించేందుకు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రూ. కోటి మంజూరు చేశారని తెలిపారు. పట్టణానికి మంజూరైన కోటిన్నర నిధులు ప్రణాళికబద్ధంగా ఖర్చుచేసేందుకు వివిధ వర్గాలతో 20మందితో కమిటీ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఈ కమిటీ సోమవారం చర్చించనున్నదని తెలిపారు. కమిటీ సలహాలు, సూచనలతో నిధులు ఖర్చుచేస్తామన్నారు.

'ప్రశ్నపత్రాల్లో తప్పులు లేకుండా చూడాలి'

నేరేడుచర్ల, ఫిబ్రవరి 25: ప్రశ్నపత్రాల్లో తప్పులు లేకుండా చర్యలు తీసుకోవాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి రాపోలు నవీన్ కోరారు. ఆదివారం నేరేడుచర్లలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రశ్నపత్రాల విషయంలో గత ప్రభుత్వం అనేక పొరపాట్లు చేసి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిందన్నారు. అటువంటి పొరపాట్లు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు.. ప్రైవేటు కళాశాలలో ఫీజులు కట్టలేదని హాల్‌టిక్కెట్లు ఇవ్వకపోవడం చేస్తే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. అక్రమంగా అధిక ఫీజులు వసూలు చేసి ఇబ్బందులకు గురిచేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అనంతరం హుజూర్‌నగర్ నియోజకవర్గ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా జిలకర రామస్వామి, ప్రధాన కార్యదర్శిగా నందిగామ గోవిందు, ఉపాధ్యక్షుడిగా అమరారపు వెంకటేష్, కోశాధికారిగా మెరిగ మట్టపల్లి, కార్యదర్శులుగా తక్కెళ్ల నాగార్జున, అమరారపు సతీష్, బీవీఎఫ్ కన్వీనర్‌గా పోలే వెంకటేశ్వర్లు, మహిళా కన్వీనర్‌గా యడవెల్లి కృష్ణవేణిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో స్టాలిన్, వెంపటి నాగమణి, పెదపంగ ఉపేందర్, కర్రి సతీష్‌రెడ్డి, సురేష్‌బాబు, విజయ్, శ్రీనివాస్, సల్మాన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

'ప్రతి సెంటు భూమికి రైతు భరోసా ఇవ్వాలి'

కోదాడ రూరల్, ఫిబ్రవరి 25: సాగు చేస్తున్న ప్రతి సెంటు వ్యవసాయ భూమికి రైతు భరోసా సాయం అందించాలని తెలుగు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లు వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా విషయంలో రోజుకో తీరులో వార్తలను ప్రచారంలోకి తెస్తూ రైతులను ఆందోళనకు గురిచేస్తుందన్నారు. ఒకరోజు ఐదు ఎకరాల వారికేనని, మరోరోజు సాగులో లేని వ్యవసాయ భూములకు రైతు భరోసా సాయం లేదని ప్రసార మాధ్యమాలలో వస్తున్న వార్తలతో రైతుల్లో గందరగోళం నెలకొంటుందన్నారు. డీజిల్, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు విపరీతంగా పెరిగినందున పండించిన పంటకు గిట్టుబాటు కావడంలేదన్నారు. ధరలు లేనందున వ్యవసాయం చేస్తే నష్టం వస్తుందనిఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సాగు చేస్తున్న ప్రతి సెంటు భూమికి రైతుభరోసా సాయం అందించాలన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 25: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దండ శ్యాంసుందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం కార్యాలయంలో హైదరాబాద్‌కు చెందిన మెడివిజన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యులు రెహానా, సంతోష్, వాసు, ఆర్గనైజర్ ఖలీల్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ సప్లై వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా వేణు

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 25: సూర్యాపేట మునిసిపల్ వాటర్ సప్లై వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా చెరుకు వేణును ఎన్నుకున్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మునిసిపల్ వాటర్ ట్యాంక్ ప్రాంతంలో వాటర్ సప్లై వర్కర్స్, లైటింగ్, బోరింగ్ సెక్షన్ యూనియన్ నూతన కమిటీని ఎన్నికలు నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా గుండు నాగరాజు, కోశాధికారిగా ఫతాని శ్రీనివాస్‌లతో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సభ్యులు సందనబోయిన రాములు, మున్యానాయక్,సమ్మి, సందీప్, సురేందర్, రాజు, భాస్కర్, సోమమ్మ, బలరాం, ఉప్పలమ్మ, దండు నాగరాజు, హరికృష్ణ, రాజు, ఉప్పలయ్య, బ్రహ్మం, మహేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నేరేడుచర్ల, ఫిబ్రవరి 25: పట్టణంలోని అంజలి స్కూల్ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ పందిరి శ్రీనివాస్ తెలిపారు. అదేవిధంగా మండలంలోని తెలగరామయ్యగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు ఉన్నందున సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.

పోలీసుస్టేషన్‌కు చేరుకున్న ఇంటర్ ప్రశ్నపత్రాలు

కోదాడ, ఫిబ్రవరి 25: ఈ నెల 28 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం సెట్ సీ ప్రశ్నపత్రాలు కోదాడ టౌన్ స్టేషన్‌కు చేరుకున్నాయి. ఇప్పటికే సెట్ ఏ, సెట్ బి, ప్రశ్నపత్రాలు చేరుకున్నట్లు డిపార్టుమెంటల్ అధికారి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. పట్టణంలో పరీక్షలు రాయడానికి ఎనిమిది సెంటర్లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

లక్ష్మీనృసింహుని నిత్యకల్యాణం

మఠంపల్లి, ఫిబ్రవరి 25: మట్టపల్లి క్షేత్రంలో ఆదివారం లక్ష్మీనృసింహుని నిత్య కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సరికొండ నవీన్, ఆలయ అర్చకులు తూమాటి శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, కృష్ణమాచార్యులు, రామాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, నరసింహమూర్తి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి భాధ్యత

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 25: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అన్నారు. బాబా హరదేవ్‌సింగ్ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని సద్దుల చెరువు మినీ ట్యాంక్ బండ్ వద్ద స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సమాజహితం కోసం సంత్ నిరంకారి సభ్యులు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అనంతరం సద్దుల చెరువులో ఉన్న ప్లాస్టిక్, వ్యర్థాలు, పిచ్చి మొక్కలను సంత్ నిరంకారి సభ్యులు తొలగించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చింతలపాటి భరత్‌మహాజన్, సంత్ నిరంకారి సభ్యులు కడారు నర్సింహారెడ్డి, విద్యాసాగర్, రమాదేవి, మధుసూదన్‌రెడ్డి, శంకుతల, రాజేష్, అరుణ, నిర్మల, కిరణ్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులే పిల్లలకు మొదటి గురువులు

కోదాడ టౌన్, ఫిబ్రవరి 25: తల్లిదండ్రులే పిల్లలకు మొదటి గురువులని పట్టణానికి చెందిన వైద్యుడు జాస్తి సుబ్బారావు, రిటైర్డు అధ్యాపకుడు మంత్రిప్రగడ భరతారావు అన్నారు. శనివారం రాత్రి కోదాడ పట్టణంలోని ఎస్‌ఆర్‌ఎం పాఠశాల దశమి వార్షికోత్సవానికి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. పాఠశాల కరస్పాండెంట్ కేశినేని శ్రీదేవి మాట్లాడుతూ పాఠశాలలో అంకితభావంతో బోధన చేస్తున్నామన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోదాడను అగ్రస్థానంలో నిలపాలి

కోదాడ, ఫిబ్రవరి 25: వర్తక, వాణిజ్య రంగాలల్లో కోదాడను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపాలని కోదాడ మునిసిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి కోరారు. ఆదివారం కోదాడ పట్టణంలోని వర్తక సంఘం భవన్‌లో నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా హాజరై మాట్లాడారు. వర్తక సంఘం ఆర్థిక పురోగతి సాధించి యువతకు ఉపాధి కల్పించాలన్నారు. ఈ సందర్భంగా వర్తక సంఘం అధ్యక్షుడిగా మేళ్లచెర్వు కిషోర్, ప్రధాన కార్యదర్శిగా కొత్తూరు పూర్ణచంద్రరావు, కోశాధికారిగా కొత్త శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా బండారు వెంకటేశ్వర్లు, చల్లా విజయ్‌శేఖర్, కందిబండ శ్రీనివాసరావు, చిన్న బ్రహ్మం, వంగవీటి శేఖర్, సురేందర్‌కుమార్, జాయింట్ సెక్రటరీలుగా చీదేళ్ల సురేష్, సత్యనారాయణ, దుర్గారావు, ఇరుకుళ్ల రాధాకృష్ణ, గాదంశెట్టి సంతోష్, ఉప కోశాధికారిగా మేళ్లచెర్వు వెంకన్నలు, ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, పట్టణ నాయకులు వర్తక సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పట్టణ నాయకులు సీహెచ్ లక్ష్మీనారాయణరెడ్డి, వంగవీటి రామారావు, పైడిమర్రి సత్తిబాబు, పారా సీతయ్య, యాదా రమేష్, మేకల శ్రీనివాసరావు, ముత్యాలు, రాయపూడి వెంకటనారాయణ, గాదంశెట్టి శ్రీనివాసరావు, పైడిమర్రి వెంకటనారాయణ, కొత్త వెంకటేశ్వర్లు, సామినేని రమేష్, వంగవీటి నాగరాజు, చారుగండ్ల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు



సమ్మేళనంలో పాల్గొన్న నూతనకల్ జడ్పీహెచ్‌ఎస్ పూర్వ విద్యార్థులు

నూతన్‌కల్, ఆత్మకూర్(ఎస్), మద్దిరాల ఫిబ్రవరి25: నూతనకల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1994-95బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలోని ఐఎల్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో సమ్మేళనాన్ని నిర్వహించారు. ఆత్మకూర్(ఎస్) మండలంలోని ఇస్తాళాపురం గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాల 1986-87 బ్యాచ్ ఏడో తరగతి విద్యార్థులు పాఠశాలలో సమ్మేళనాన్ని నిర్వహించారు. మద్దిరాల మండలంలోని గోరెంట్ల గ్రామ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 2006-07బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి గురువులను సన్మానించారు. నూతనకల్‌లో జయకుమార్, లింగరాజు, మాధవరెడ్డి, సైదులు, యాదగిరి, మాధవి, ఉమ, సుజాత, మల్లారెడ్డి, సైదులు, అశోక్, మధుసూదరెడ్డి, ఇస్తాళాపురంలో తూడి వెంకటేశ్వర్లు, ఏ.వెంకటేశ్వర్‌రావు, ఇరుగు ముత్తయ్య, ఉప్పల వెంకన్న, పి.కృష్ణమాచారి, గోరెంట్ల గ్రామంలో హెచ్‌ఎం చిలుక శ్రీనివాస్, యాకయ్య, బయ్య లింగన్న, పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 25: పట్టణంలోని శ్రీనగర్‌కాలనీకి చెందిన దడిగల పిచ్చయ్య ఇటీవల మేడారం జాతరకు వెళుతూ గుండెపోటుతో మృతి చెందగా , ఆయన కుటుంబానికి ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్ ఆధ్వర్యంలో ఐఎన్‌టీయూసీ కార్మికులు రూ.15వేలు ఆర్థికసాయం చేశారు. ఈ సందర్భంగా నాగన్న మాట్లాడుతూ పిచ్చయ్య కుటుంబానికి అండగా ఉంటామని, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో మాట్లాడి నాగన్న కుటుంబానికి ఫణిగిరి గట్టు వద్ద ఇంటిని మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గురవయ్యగౌడ్, చింతకాయల రాము, జానయ్య, వీరబాబు, సుబ్బారావు, ప్రసాద్, వీరయ్య, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

'విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలి'

కోదాడ టౌన్, ఫిబ్రవరి 25: కోదాడ నియోజకవర్గంలో ఈ నెల 29వ తేదీన ప్రారంభమయ్యే బీజేపీ విజయ సంకల్ప బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యరెడ్డి కోరారు. ఆదివారం కోదాడలోని బీజేపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు సాతులూరి హనుమంతరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలందరూ ఈ యాత్రలో పాల్గొని 'దేశం కోసం మోదీ.. మోదీ కోసం మనం' అనే నినాదంతో ముందుకు సాగాలన్నారు. నల్లగొండ ఎంపీ స్థానంలో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కిరాజు యశ్వంత్, బొలిశెట్టి కృష్ణయ్య, నూనె సులోచన, సతీష్, ఓరుగంటి పురుషోత్తం, కొండా రవికుమార్, కృష్ణప్రసాద్, శ్రీనివాస్, దుగ్గి వెంకటేష్, పుల్లయ్య, కార్తీక్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధికి నోచుకోని గ్రామాలు

గరిడేపల్లి, ఫిబ్రవరి 25: బీఆర్‌ఎస్ పాలనలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని రామచంద్రాపురంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదని, చేసిన పనుల్లో నాణ్యత లేదని అన్నారు. గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక మురుగు నీరుతో దోమల బెడద ఎక్కువయి మలేరియా, డెంగీ విజృంభించాయన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో ప్రణాళిక ప్రకారం గ్రామాలను అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బచ్చలకూరి కృష్ణప్రసాద్, ఉప సర్పంచ్ గన్నా నాగేశ్వరరావు, అశోక్, లింగయ్య, సాయిరామ్, సైదులు, రవీందర్, వె ంకటనర్సు, మల్లమ్మ, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై కేంద్రానిది మోసపూరితమైన వైఖరి

సూర్యాపేటటౌన్, ఫిబ్రవరి 25: కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేపట్టకుండ మోసపూరితమైన వైఖరి అవలంబిస్తోందని ఎమ్మార్పీఎస్ తెలంగాణ సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పల్లేటి లక్ష్మణ్ మాదిగ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా మాదిగలకు న్యాయం చేసేలా ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందని ఆరోపించారు. బీజేపీకి కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే మాదిగలు గుర్తువస్తారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి మాదిగలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈనెల 27వ తేదీన జిల్లా కేంద్రంలోని పద్మశాలీ భవనంలో జరిగే జిల్లా సదస్సును జయప్రదం చేయాలని కోరారు. "కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కనుకు జానయ్యమాదిగ, కనుకు ప్రశాంత్, రాజేష్, భరత్, గోపి, చిరంజీవి పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

మద్దిరాల, ఫిబ్రవరి 25: గ్రామాలాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పార్టీ మండల అధ్యక్షుడు అవిలమల్లుయాదవ్ అన్నారు. ఆదివారం మద్దిరాల మండల కేంద్రంలో ఎన్‌ఆర్‌జీఎస్ నిధుల కింద మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి ఆయన మాట్లాడారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.